సాక్షి నిజామాబాద్

ఆదివారం । 19 । మే । 2024



ఉంటే ఇన్‌చార్జి.. లేదంటే ఖాళీ

వైద్యారోగ్యశాఖలో ప్రధాన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. సిబ్బందిపై పనిభారం పెరుగుతోంది. పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

- 10లో ▸



సదరం.. నిరంతరం

సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగనుంది. మీ సేవ కేంద్రాల్లో ఎప్పుడైనా స్లాట్ బుక్ చేసుకోవచ్చు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.3 /25.6

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఎండ తీవ్రత కాస్త తగ్గుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఈఏపీ సెట్‌లో గురుకుల విద్యార్థినుల సత్తా



కె స్రవంతి (అగ్రికల్చర్ 3,850 ర్యాంకు)



పి పూజ (ఇంజనీరింగ్ 15,383 ర్యాంకు)

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలోని ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీ సెట్) ఫలితాల్లో డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల ప్రతిభా (సీవోఈ) కళాశాల విద్యార్థినులు విజయఢంకా మోగించారు. కళాశాల విద్యార్థినులు మంచి ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ బి సంగీత తెలిపారు. అగ్రికల్చర్ విభాగంలో కె స్రవంతి 3,850 ర్యాంకు, ఇంజనీరింగ్ విభాగంలో పి పూజ 15,383 ర్యాంకు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. అగ్రికల్చర్ – ఫార్మసీ విభాగంలో పది వేల లోపు ర్యాంకు సాధించిన వారు 7, ఇరవై వేల లోపు 7, ముప్పై వేల లోపు 6, యాభై వేల లోపు ఐదుగురు ఉన్నారని తెలిపారు. అదే విధంగా ఇంజనీరింగ్ విభాగంలో ఇరవై వేల లోపు ర్యాంకు సాధించిన వారు 3, ముప్పై వేల లోపు 6, యాభై వేల లోపు ముగ్గురు ర్యాంకు సాధించారన్నారు.

ప్రగతిచక్రం పురస్కారాలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని ఆరు డిపోలకు చెందిన 86 మంది కండక్టర్లు, డ్రైవర్లను ప్రగతిచక్రం త్రైమాసిక పురస్కారాలతో ఆర్టీసీ ఆర్ఎం జానిరెడ్డి శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ.. డ్రైవర్లు ప్రయాణిలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారని, అలాగే కేఎంపీఎల్‌ను పెంచుతున్నారని అన్నారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌తోపాటు జనవరి, ఫిబ్రవరి, మార్చి వరకు రెండు త్రైమాసిక పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సరస్వతి, రీజినల్ మేనేజర్(ఎం), వి. శంకర్, డిపో మేనేజర్లు ఆనంద్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను పరిష్కరించాలి



పెర్కిట్(ఆర్మూర్): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆర్మూర్, ముథోల్ ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, రామారావు పటేల్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో సీఎంకు వినతిపత్రం అందజేశారు. అకాలవర్షాల కారణంగా ధాన్యం తడుస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. లారీల కొరత కారణంగా కాంటా పూర్తయిన ధాన్యాన్ని మిల్లులకు తరలించకపోవడంతో రైతులు రోజులపాటు నిరీక్షిస్తున్నారని సీఎంకు వివరించారు. అలాగే ఎన్నికల హామీ మేరకు క్వింటాలు వరికి రూ.500 బోనస్, రైతులు, కౌలురైతులకు రూ.15వేలు, కూలీలకు రూ.12 వేలు చెల్లించాల, ఆగస్టు 15వ తేదీలోగా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సీఎంను కోరారు.

యూనిఫామ్‌లు అందించాలి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా మహిళా సంఘాలు యూనిఫామ్‌లు అందించాలని డీఆర్డీవో సాయాగౌడ్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు యూనిఫామ్‌లు కుట్టే అవకాశం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మహిళా సంఘాలకు దక్కిందని తెలిపారు. మండల కేంద్రంలోని ట్రైజం ట్రైనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ (టీటీడీసీ) లో శనివారం నిర్వహించిన జిల్లా సమాఖ్య సమావేశానికి డీఆర్డీవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్కూల్ యూనిఫామ్‌లు కుట్టేందుకు మండల, గ్రామస్థాయిల్లో మంచి స్పందన వచ్చిందని, మహిళా సంఘాల సభ్యులకు మండల స్థాయిలో కుట్టు మిషన్‌లపై, కటింగ్‌పై శిక్షణ ఇచ్చామన్నారు. మరుగుదొడ్లు, ప్రహరీలు లేని పాఠశాలల్లో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పనులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. అడిషనల్ డీఆర్డీవో రవీందర్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధ, డీపీఎంలు, స్త్రీనిధి, సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

డిచ్‌పల్లి మండలం ముల్లంగి పాఠశాలలో నిలిచిన ఫ్లోరింగ్ పనులు (ఫైల్)





ధర్మారం పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నిధులు లేక.. నిలిచిన పనులు

- పాఠశాలలో వసతుల కల్పనకు నిధులు కరువు
- రూ.39 కోట్ల పనులకు మంజూరైంది రూ.3 కోట్లే
- పలు బడుల్లో ప్రారంభం కాని పనులు

నిజామాబాద్ అర్బన్: నిధులు లేక ప్రభుత్వ పాఠశాలల్లో పనులు నిలిచిపోయాయి. విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోపు పాఠశాలల్లో వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం ఏప్రిల్ 15 నుంచి జిల్లాలో అవసరమైన పాఠశాలలను ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. జిల్లాలో 1192 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.

అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా వసతులు కల్పించడానికి 792 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పనులకు రూ.39 కోట్ల 38 లక్షలు అవసరమని అధికారులు నిర్ధారించారు. దీనికి కలెక్టర్ పరిపాలన అనుమతులు కూడా ఇచ్చారు. దీంతో పనులు ప్రారంభించేందుకు పది శాతం నిధులు విడుదల చేశారు. మిగతా నిధులు పనులు సాగిన కొద్ది విడుదల చేయాలని నిర్ణయించారు. గ్రామాల్లో పంచాయతీరాజ్ అధికారులకు, మున్సిపాలిటీల పరిధిలో ఆర్అండ్‌బీ, వైద్య ఆరోగ్య శాఖకు చెందిన ఇంజినీరింగ్ అధికారులకు పనులు అప్పగించారు.

నాలుగు పాఠశాలల్లోనే పనులు పూర్తి

పాఠశాలల్లో పనులు చేపట్టడానికి అమ్మ ఆదర్శ కమిటీ విలేజ్ ఆర్గనైజర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడి జాయింట్ ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నారు. పాఠశాల కమిటీ వారే పనులు చేపట్టాలి. అయితే కొన్ని చోట్ల ఇతరులకు పనులు అప్పగించారు. ఆయా పనులకు ఏప్రిల్ 15న నిజామాబాద్ అర్బన్ మినహా జిల్లాలోని మిగతా పాఠశాలలకు 10 శాతం అడ్వాన్స్ నిధులు కేటాయించారు. వాటితో కొన్ని చోట్ల పనులు మొదలు పెట్టారు. మిగతా నిధులు అందుబాటులో లేకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులు ఎత్తేశారు. నిధులు ఉంటేనే పనులు చేస్తామని వారు తేల్చి చెబుతున్నారు. మరోవైపు జూన్ 10 లోపు పనులు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో 560 పాఠశాలల్లో పనులు ప్రారంభం కాగా నాలుగు పాఠశాలల్లో మాత్రమే పూర్తయ్యాయి.

జిల్లాలో ఎంపికైన కొన్ని పాఠశాలలు

మండలం	పాఠశాలలు	మండలం	పాఠశాలలు	మండలం	పాఠశాలలు
భీమ్‌గల్	39	నిజామాబాద్ నార్త్	21	సాలూరా	10
బోధన్	55	నిజామాబాద్ రూరల్	29	వర్ని	27
మాక్లూర్	38	ముప్కాల్	11	వేల్పూర్	25
నవీపేట	39	నందిపేట	12	ఎడపల్లి	24
సిరికొండ	38	మోస్రా	8	చందూరు	07
డిచ్‌పల్లి	44	మెండోరా	15	ఇందల్వాయి	32
మోపాల్	29	కోటగిరి	16	జక్రాన్‌పల్లి	32
		డొంకేశ్వర్	16	కమ్మర్‌పల్లి	20

చేయాల్సిన పనులు

- పాఠశాలలో నీటి సౌకర్యం
- మూత్రశాలలకు మరమ్మతులు
- విద్యుత్ సమస్యల పరిష్కారం
- భవనాలకు మరమ్మతులు చేయాలి

పనులు కొనసాగుతున్నాయి

జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అడ్వాన్స్ కింద 10 శాతం నిధులు మంజూరు చేశాం. నిర్ణీత సమయంలో పనులు పూర్తయ్యేలా చూస్తాం.
– దుర్గాప్రసాద్, డీఈవో

సొంతగడ్డపై మమకారంతో..

- జర్మనీలో ఉంటూ సొంత జిల్లాలో యువతకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కల్పన
- మాధవనగర్‌లో 'టెక్.ఎట్.కోర్' కార్యాలయం.. మెట్రోసిటీ స్థాయిలో ప్యాకేజీలు
- యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న జాగిరపు జయసాగర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: గ్లోబలైజేషన్ నేపథ్యంలో యువత ఆకాశమే హద్దుగా తమ ప్రతిభాపాటవాలను చాటుతోంది. ఈ క్రమంలో ఉత్తర అమెరికా, యూరప్, ఆస్ట్రేలియాల్లో ఉద్యోగాలు చేసేందుకు, సాధ్యమైతే అక్కడే స్థిరపడేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేరెన్నికగన్న గూగుల్, మైక్రోసాఫ్ట్, పెప్సీకో లాంటి తదితర సుమారు 30 కంపెనీలకు భారతీయులే సీఈవోలుగా ఉన్నారు. నాసాలోనూ భారతీయులదే కీలక పాత్ర. ఇలాంటి పరిస్థితుల్లో మాతృభూమికి సైతం అక్కడే ఉండి సేవలందించేందుకు తాపత్రయపడే వారు చాలా తక్కువమంది ఉంటున్నారు. ఇలాంటి కొద్దిమందిలో ఇందూరు జిల్లాలోని సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన జాగిరపు జయసాగర్‌రెడ్డి ఉన్నారు.



- సాఫ్ట్‌వేర్ నిపుణుడిగా పనిచేసేందుకు ఎనిమిదేళ్ల క్రితం జర్మనీకి వెళ్లిన జయసాగర్‌రెడ్డి అక్కడే 'టెక్.ఎట్.కోర్ ప్రైవేట్ లిమిటెడ్' పేరిట సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేశారు. ఈ కంపెనీకి సీఈవోగా జయసాగర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. ప్రధాన కార్యాలయం జర్మనీలోని బెర్లిన్‌లో ఉండగా రీజినల్ కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. భారత్‌లో ఇంజనీరింగ్ హెడ్‌గా కంపెనీ డైరక్టర్ మదన్‌మోహన్ ఉన్నారు. భారత్‌లో కంపెనీ ఎండీగా పెద్దవాల్గోట్ గ్రామానికే చెందిన జాగిరపు ప్రసాద్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు.



నిజామాబాద్ బ్రాంచ్‌లో ఆపరేషన్స్ నిర్వహిస్తున్న ఉద్యోగులు

ఇందూరులో 70 మంది నిపుణులకు ఉద్యోగాలు..

'టెక్.ఎట్.కోర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆపరేషన్స్ శాఖ కార్యాలయాన్ని నిజామాబాద్‌లోని మాధవనగర్ వద్ద ఏర్పాటు చేశారు. ఇందులో మొత్తం 70 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ 70 మందిలో సాఫ్ట్‌వేర్ డెవలపర్స్, క్వాలిటీ అనలిస్టులు, అడ్మినిస్ట్రేషన్, హెచ్ఆర్, అకౌంట్స్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల నిపుణులు ఉన్నారు. వీరందరికీ మెట్రోపాలిటన్ సిటీ స్థాయి ప్యాకేజీలో జీతాలు అందిస్తున్నారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ నిపుణుల్లో తెలంగాణలోని వివిధ జిల్లాల వారితో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ రాష్ట్రాలవారు 10 మంది ఉన్నారు. మిగిలినవారు తెలంగాణ జిల్లాలకు చెందినవారు కాగా ఇందులో సగానికి పైగా జిల్లాకు చెందినవారే కావడం గమనార్హం.

లోకల్ టాలెంట్‌ను ప్రోత్సహించేందుకే..



దేశవిదేశాల్లో పనిచేస్తున్నవారిలో అత్యధికమంది గ్రామీణప్రాంతాల నుంచి వచ్చినవారే. లోకల్ టాలెంట్‌ను మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో నిజామాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఆపరేషన్స్ బ్రాంచ్‌ను నెలకొల్పాం. ప్రస్తుతం మా కంపెనీ 12 ప్రాజెక్టులను నిర్వహిస్తోంది. 2020 మే నుంచి నిజామాబాద్‌లో కన్సల్టెన్సీ సర్వీసులు మొదలుపెట్టాం. హైదరాబాద్ కంటే నిజామాబాద్‌కే ప్రాధాన్యత ఇవ్వాలనే నిర్ణయంతో ముందుకు వెళ్తున్నాం. బాసర ట్రిపుల్ ఐటీలో చదివిన 9 మందికి ఉద్యోగాలిచ్చాం. ప్లేస్‌మెంట్స్ కోసం ట్రిపుల్ ఐటీ నుంచి రెగ్యులర్‌గా కాల్స్ వస్తున్నాయి. – జాగిరపు ప్రసాద్‌రెడ్డి, ఎండీ

కలగానే మంజీరపై చెక్‌డ్యాం

- ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం
- కొత్త ప్రభుత్వం పై రైతుల ఆశలు

బోధన్: సాలూర మండల కేంద్ర శివారులో తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దుల మధ్య ప్రవహిస్తున్న మంజీర నదిపై చెక్‌డ్యాం నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. ప్రభుత్వాలు మారినా రైతులు ఏళ్లుగా ఎదురు చూస్తున్న చెక్‌డ్యాం నిర్మాణం మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. ఏటా వర్షాకాలంలో మంజీర నదిలో వరద పోటెత్తి రెంజల్ మండలంలోని కందకుర్తి వద్ద గోదావరి నదిలో కలిసిపోతుంది. సాలూర గ్రామ శివారులోని మంజీర నదిపై చెక్‌డ్యాం నిర్మాణం జరిగితే సాలూర గ్రామ రైతులతో పాటు నది అంచున ఉన్న ఖాజాపూర్, హున్సా, మందర్న గ్రామాల రైతులకు మేలు జరుగుతుంది. ఈ మూడు గ్రామాలకు ఎలాంటి ప్రాజెక్టులు, చెరువులు లేవు. కరెంట్ బోరుబావుల పై ఆధారపడి రైతులు పంటల సాగు చేస్తారు. అన్ని రకాల పంటల సాగుకు అనువైన సారవంతమైన సుమారు 7 వేల ఎకరాల నల్లరేగడి భూములు ఈ ప్రాంతంలో ఉన్నాయి. చెక్‌డ్యాం నిర్మాణమైతే భూగర్భజలాలు పెరిగి కరెంట్ బోరుబావుల్లో పుష్కలంగా నీరు నిల్వ ఉంటుంది. సుమారు 16 వందల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందిస్తున్న సాలూర ఎత్తిపోతల పథకానికీ జలనిధి సమకూరుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు ఆశలు పెట్టుకున్నారు.



సాలూర శివారులోని పాత వంతెన వద్ద వరద నీటి ప్రవాహం (ఫైల్)



ఎత్తిపోతల ప్రధాన పంప్ హౌజ్

సాగు నీటి సమస్యకు 'చెక్‌డ్యాం'

ఉమ్మడి రాష్ట్రంలో చెక్‌డ్యాం ప్రతిపాదన పరిశీలనలో ఉండేది. 2014 లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం మళ్లీ మంజీర నది పై చెక్‌డ్యాంల నిర్మాణం ప్రతిపాదన తెరపైకి వచ్చింది. 2015 మార్చిలో అప్పటి సీఎం కేసీఆర్ గోదావరి నదీ జలాల వివాద అంశంపై అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం ఫడ్నవిస్‌తో చర్చించేందుకు ముంబాయి వెళ్లారు. ఈ సందర్భంగా బోధన్, బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని రైతులు మంజీర నది పై చెక్‌డ్యాంల నిర్మాణం విషయాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. 2016–17 లో గత ప్రభుత్వం సాలూర శివారులో చెక్‌డ్యాం నిర్మాణం కోసం ఇరిగేషన్ శాఖ ద్వారా సర్వే చేయించింది. ఇందుకు రూ. 62 కోట్ల నిధులు అవసరం ఉంటుందని అధికారులు ప్రతిపాదనలు పంపించినట్టు స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పుకొచ్చారు. ఆ తర్వాత కారణాలేమిటో కాని చెక్‌డ్యాం నిర్మాణం ప్రతిపాదనలకే మిగిలిపోయింది.

సరిహద్దు వివాదమే ప్రధాన సమస్య ..

తెలంగాణ – మహారాష్ట్రల మధ్య మంజీర నదిలో సరిహద్దు వివాదం ఏళ్లుగా అపరిష్కృతంగానే మిగిలి ఉంది. కొన్నేళ్ల నుంచి మహారాష్ట్ర ప్రభుత్వం నదిలోని అక్కడి ప్రాంతంలో ఇసుక క్వారీలకు విచ్చలవిడిగా అనుమతులిస్తోంది.

కాంట్రాక్టర్లు మన ప్రాంత సరిహద్దులోని నదిలోకి చొచ్చుకొచ్చి భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదం జఠిలమయ్యేందుకు కారణమవుతోంది. చెక్‌డ్యాం నిర్మాణం జరగాలంటే రెండు రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య సానుకూలమైన విధానపరంగా నిర్ణయం జరగాల్సి ఉంటుంది. జిల్లా, నియోజక వర్గ ముఖ్య ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని అంతర్రాష్ట్ర సరిహద్దు వివాదంతో పాటు చెక్‌డ్యాం నిర్మాణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

చెక్‌డ్యాం నిర్మించాలి



సాలూర శివారులో మంజీరపై చెక్‌డ్యాం నిర్మించాలని ఏళ్లుగా కోరుతున్నాం. ఏటా వర్షాకాలంలో నదిలో వరద పోటెత్తి గోదావరిలో కలుస్తుంది. వర్షాకాలం అనంతరం మంజీర నదిలో నీళ్లు అడుగంటిపోతాయి. ఎత్తిపోతల పథకం కింద 16 వందల ఎకరాల ఆయకట్టు ఉంది. నదిలో నీళ్లు లేనప్పుడు ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారుతుంది. చెక్‌డ్యాం ఉంటే సాగు నీటి సమస్య పరిష్కారమవుతుంది. – కేజీ గంగారాం, రైతు, సాలూర గ్రామం

జోరుగా బెట్టింగ్

- ఎంపీ అభ్యర్థుల గెలుపోటములపై పందాలు
- రూ.వేయి నుంచి రూ.లక్షల్లో..
- మధ్యవర్తుల వద్ద నగదు, చెక్కులు

ఖలీల్‌వాడి: 'ఢిల్లీకి వెళ్లేదెవరు..?' అంటూ గల్లీ నుంచి జిల్లా కేంద్రం వరకు జోరుగా బెట్టింగ్ సాగుతోంది. మూడు ప్రధాన పార్టీలు పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, ఎవరికివారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. 71శాతానికిపైగా పోలింగ్ నమోదుకావడం, ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధించినా స్వల్ప మెజార్టీ తేడా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గెలుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్న నేపథ్యంలో ఇదే అదునుగా బెట్టింగ్ రాయుళ్లు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. మండల స్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు ఎవరికి వారు అభ్యర్థుల గెలుపోటములపై రూ.వేయి నుంచి లక్షల్లో బెట్టింగులు పెట్టినట్లు సమాచారం. ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారని కొందరు, మరో ప్రధాన పార్టీకి చెందిన అభ్యర్థి గెలుపుపొందుతారని మరికొందరు బెట్టింగ్ రాయుళ్లు నగదు, చెక్కులను మధ్య వర్తుల వద్ద పెట్టి బెట్టింగ్ కాస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఐదు నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సమయంలో ఎమ్మెల్యే అభ్యర్థులు గెలుపోటములపై బెట్టింగ్ పెట్టి లాభ పడిన



వారు, నష్టపోయిన వారే ప్రస్తుతం జోరుగా బెట్టింగ్‌లు పెడుతున్నారని పలువురు అంటున్నారు. ఈవీఎంలలో నిక్షిప్తమైన ఫలితం ఎవరిపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాల్సిందే.

గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు ఏర్పాట్లు చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) ద్వారా జూన్ 9వ తేదీన గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని చైర్మన్ ఎం మహేందర్‌రెడ్డి సూచించారు. గ్రూప్–1 ప్రిలిమ్స్ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, సీపీతో శనివారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జూన్ 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రిలిమ్స్ పరీక్ష కొనసాగుతుందని, బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రలను సేకరించనున్న నేపథ్యంలో అభ్యర్థులు నిర్ణీత సమయానికి రెండు గంటల ముందే కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. ఉదయం 10 గంటల వరకే పరీక్షా కేంద్రంలోకి వెళ్లేందుకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు 9 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల బయోమెట్రిక్ సేకరణ కోసం 160 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్‌తోపాటు అదనంగా మరొకరిని నియమించాలని ఆదేశించారు. అభ్యర్థుల సహాయార్థం హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. పోలీస్ ఉన్నతాధికారులు నోడల్ పోలీసు ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. దివ్యాంగులైన అభ్యర్థులు తమవెంట వైకల్య ధ్రువీకరణపత్రాన్ని తీసుకురావాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ప్రాంతీయ సమన్వయకర్త రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెడికవర్ ఆస్పత్రికి నోటీసు జారీ

నిజామాబాద్‌నాగారం: నగరంలోని మెడికవర్ ప్రైవేట్ ఆస్పత్రికి ఆరోగ్య శ్రీ ట్రస్టు శనివారం నోటీసు జారీ చేసింది. ఆరోగ్య శ్రీ సేవల కింద హార్ట్ ఆపరేషన్ విషయంలో రోగి నారాయణ వద్ద రూ. 80వేలు వసూలు చేసినట్లు ఫిర్యాదు అందింది. రోగి మరణించడంతో కుటుంబ సభ్యులు నాలుగోటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో క్రిమినల్ కేసు నమోదైంది. అలాగే ఆరోగ్య శ్రీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగి నుంచి డబ్బులు తీసుకున్న వ్యవహారంపై ట్రస్ట్ అధికారులు విచారణ చేపట్టారు. దీంతో యాజమాన్యానికి జిల్లా కోఆర్డినేటర్ స్వప్న నోటీసు జారీ చేశారు.

ఘటనపై కలెక్టర్ సీరియస్..

నిజామాబాద్‌నాగారం: మెడికవర్ ఆస్పత్రిలో ఈ నెల 17న రోగి మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సీరియస్‌గా స్పందించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాథోడ్‌నాయక్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టాలని ఆదేశించారు. కాగా ఇప్పటికే ఈ నెల 17, 18వ తేదీల్లో డీఎంహెచ్‌వో విచారణ చేసిన నివేదికను కలెక్టర్‌కు అందించారు. రోగి గుండెపోటుతోనే మరణించారని గుర్తించారు. అయితే ఈ ఘటనపై సమగ్రంగా సంబంధిత వైద్యులతో విచారణ చేయించాలని డీఎంహెచ్‌వో కలెక్టర్‌కు విన్నవించారు.

మళ్లీ ప్రత్యేక కమిటీతో విచారణ

సమగ్రంగా విచారణ చేయడానికి జీజీహెచ్‌లోని వైద్యులతో ప్రత్యేక కమిటీ వేయనున్నట్లు తెలిసింది. అధికారులు కమిటీతో విచారణ చేయించి తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

వైద్యులపై చర్యలు తీసుకోవాలని వినతి



నిజామాబాద్‌నాగారం: నగరంలోని షాహీన్ ఆస్పత్రిలో ఇటీవల వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ మహిళ గర్భాశయం తొలగించడం జరిగింది. దీంతో వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ శనివారం జిల్లా వైద్యశాఖ ఏవో చందర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బాన్సువాడకు చెందిన ఓ గర్భిణి డెలివరీ కోసం జిల్లా కేంద్రంలోని షాహీన్ ఆస్పత్రిలో చేరారు. వైద్యులు సిజేరియన్ సందర్భంగా సరిగా ఆపరేషన్ చేయకపోవడం, అది వికటించడంతో గర్భాశయాన్ని తొలగించిన ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు.

సదరు ఆస్పత్రిలో ఆపరేషన్‌కు సంబంధించిన పరికరాలు లేకపోవడంతో మరో ఆస్పత్రికి రెఫర్ చేశారని పేర్కొన్నారు. కాగా మరో ఆస్పత్రికి వెళ్లిన సదరు గర్భిణికి చికిత్స చేసిన వైద్యులు ఇక జీవితంలో గర్భం దాల్చలేదని చెప్పారని అన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'ఈఏపీ సెట్'లో కాకతీయ హవా

- 13 మందికి రాష్ట్రస్థాయి ర్యాంకులు
- తొలి ప్రయత్నంలోనే..
- ఎం మహిరకు జిల్లా ప్రథమ, రాష్ట్రస్థాయి ఉత్తమ ర్యాంకు
- ఇంజినీరింగ్, ఫార్మసీలో సత్తా
- ప్రతిభ చాటిన ఎస్ఆర్ విద్యార్థులు



మణికాంత్, కాకతీయ(2580) · మల్లిక్, కాకతీయ(3290) · రిషిక్‌సాయి, కాకతీయ(4161) · అంజుమ్, కాకతీయ(4247) · శ్రీహిత, కాకతీయ(5084) · తయ్యబ్, కాకతీయ(5400)



భార్గవసాయి, కాకతీయ(5629) · హది, కాకతీయ(6500) · శ్రేయన్స్, ఎస్ఆర్ కళాశాల(2098)

నిజామాబాద్‌అర్బన్: ఈఏపీ సెట్ ఫలితాల్లో కాకతీయ జూనియర్ కళాశాల సత్తా చాటింది. రాష్ట్ర స్థాయిలో కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. జిల్లా మొదటి ర్యాంకు కూడా కాకతీయ కళాశాలకు చెందిన విద్యార్థికి లభించింది. శనివారం విడుదలైన ఈ ఫలితాల్లో విద్యార్థులు ఈ ఘనత సాధించినట్లు కళాశాల డైరెక్టర్ రామోజీరావు తెలిపారు. తొమ్మిది వేల లోపు 13 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం విశేషం. కళాశాలకు చెందిన ఎం మహిర జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 1424 ర్యాంకు సాధించింది. మినహాజ్ 2224, ఈ మణికాంత్ 2580, ఎ మల్లిక్ 3290, రిషిక్ సాయి 4161, అంజుమ్ 4247, శ్రీహిత 5084, తయ్యాబ్ 5400, భార్గవ్ సాయి 5629, ఎ ఆది 6500, పి లక్షిత్ 8616, ఎ మొయిద్ 9222 ర్యాంకులు సాధించారు. వీరు ఇంటర్ తొలి ప్రయత్నంలోనే రాష్ట్ర స్థాయి ఈఏపీ సెట్ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కాకతీయ డైరెక్టర్ సీహెచ్ తేజస్విని మాట్లాడుతూ.. ఉత్తమ ఫలితాలు సాధించడానికి కాకతీయ ఐఐటీ నీట్, ఏపీసెట్ అకాడమీలోని ప్రత్యేక పాఠ్య ప్రణాళిక అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన యాజమాన్యం నిరంతర పర్యవేక్షణతోనే సాధ్యమైందన్నారు. రానున్న రోజుల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు దేశవ్యాప్తంగా తమ ప్రతిభ చాటుతారని అన్నారు. కాకతీయలో చేరిన ప్రతి విద్యార్థి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచడం జరుగుతుందన్నారు.

ఎక్కడా లేని విధంగా ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ప్రణాళికను అమలు చేసి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కాకతీయ నడుం బిగించిందని పేర్కొన్నారు. ఈ ఫలితాలలో కాకతీయ టాలెంట్ మరోసారి నిరూపితమైందన్నారు. కార్యక్రమంలో కాకతీయ కళాశాలకు చెందిన డైరెక్టర్ రామోజీరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ కళాశాలలో..

నగరంలోని ఎస్ఆర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈఏపీ సెట్‌లో ప్రతిభ చాటారు. శ్రేయన్స్ కుమార్ 2098వ ర్యాంకు, రమారాణి ఆకాశ్‌రెడ్డి 3978, నిహారిక 5040, స్నేహిత 6095, భవ్య 6152, వర్షణి 6252 ర్యాంకులు సాధించారు. విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడం గర్వంగా ఉందని కళాశాల డీజీఎం గోవర్ధన్ రెడ్డి, ఇన్‌చార్జి శ్రీకాంత్ తెలిపారు. కళాశాల చెందిన 14 మంది విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు వచ్చినట్లు వారు పేర్కొన్నారు.

నారాయణ విద్యార్థుల ప్రతిభ

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని నారాయణ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈఏపీ సెట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు.

కళాశాలకు చెందిన మద్రి హర్ష రాష్ట్రస్థాయిలో 1579, సాయికిరణ్ 3135, రాజశేఖర్ 5235 ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

నిరాశపర్చిన ఇతర కళాశాలలు

ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన కొన్ని ప్రైవేటు కళాశాలలు ఈఏపీసెట్ ఫలితాల్లో నిరాశపర్చాయి. నగరంలోని ఓ కళాశాల ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ఉత్తమ మార్కులు సాధించగా ఈఏపీ సెట్ ఫలితాల్లో మాత్రం కనీస ర్యాంకులు కూడా సాధించలేదు. వినాయకనగర్ ప్రాంతంలో ఉన్న మరో కళాశాల సైతం ఈఏపీసెట్ ఫలితాల్లో ప్రతిభ చాటలేదు. ఇంటర్ ఫలితాల్లో 985 మార్కులు సాధించిన విద్యార్థులకు మెయిన్స్‌లో అర్హత కోల్పోగా ఎంసెట్‌లో కూడా అర్హత సాధించలేకపోయారు. ఇలా జిల్లాలోని పలు ప్రైవేట్ కళాశాలలకు చెందిన విద్యార్థుల పరిస్థితి ఇలాగే ఉంది.

చక్కటి ప్రణాళికతో..



నేను ఈఏపీ సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 1424 ర్యాంకు, జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడం సంతోషంగా ఉంది. కళాశాలలో చక్కటి ప్రణాళిక, పరీక్షల నిర్వహణ, వ్యక్తిగత శ్రద్ధతోనే ఈ ర్యాంకు సాధించాను. నా విజయానికి కారణమైన కాకతీయ కళాశాల యాజమాన్యానికి ధన్యవాదాలు. అధ్యాపక బృందం ఎంతగానో తోడ్పాడు అందించింది.

– ఎం మహిర, కాకతీయ విద్యార్థి

తొలి ప్రయత్నంలోనే ర్యాంకు సాధించా



అధ్యాపక బృందం కృషితో నేను తొలి ప్రయత్నంలోనే ఈఏపీ సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించాను. అధ్యాపక బృందానికి, యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు. జేఈఈ మెయిన్స్‌తో ఈఏపీ సెట్‌లో ప్రణాళిక ప్రకారం చదివాను. భవిష్యత్తులో ఎలక్ట్రానిక్ విభాగంలో ఇంజినీరింగ్ కావాలని ఉంది. నా కలను సాకారం చేసేందుకు కష్టపడతాను. – మిన్హాజ్, కాకతీయ విద్యార్థి

ఫలితాల్లో మెరిసిన జిల్లా వాసులు



జ్యోతిసమన్విత్(114) · మేసా అర్జున్(579)

పెర్కిట్: టీఎస్ ఈఏపీ సెట్ ఫలితాల్లో ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ గ్రామానికి చెందిన దువ్వూరి జ్యోతి సమన్విత్ ఇంజినీరింగ్ విభాగంలో 114 ర్యాంకు సాధించాడు. పెర్కిట్‌కు చెందిన దువ్వూరి మహేంద్ర, లక్ష్మీ రాజ్యం దంపతుల పెద్ద కుమారుడు జ్యోతి సమన్విత్. పెర్కిట్ సేయింట్ ఆన్స్ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశాడు. పదో తరగతి వరకు కృష్ణాజిల్లా గుడివాడ విశ్వ భారతి పాఠశాలలో పదో తరగతిలో పది జీపీఏ, హైదరాబాద్ నారాయణ కళాశాలలో ఇంటర్ చదివి 985 మార్కులు సాధించాడు. ఈఏపీ సెట్ ఇంజినీరింగ్ విభాగంలో 144 ర్యాంకు, జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 112 ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం జేఈఈ అడ్వాన్స్‌కు సమాయత్తం అవుతున్నాడు. జేఈఈ అడ్వాన్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి ఐఐటీ మద్రాస్‌లో ఇంజినీరింగ్ విద్యనభ్యసించాలనే లక్ష్యంతో సమన్విత్ పట్టుదలతో చదువుతున్నాడు. విద్యార్థి తండ్రి మహేంద్ర జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ సంతోషనగర్ ప్రైమరి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం నరేందర్ పెద్ద కుమారుడు మేసా అర్జున్ ఈఏపీ సెట్ అగ్రికల్చర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 579 ర్యాంకు సాధించాడు. భీంగల్ మండలం బెజ్జోరకు చెందిన అర్జున్ జిల్లా కేంద్రంలోని విజయ్ హైస్కూల్‌లో పదో తరగతి చదివి పది జీపీఏ, హైదరాబాద్‌లోని చైతన్య కళాశాలలో ఇంటర్ చదివి 920 మార్కులు సాధించాడు. ఇటీవల నిర్వహించిన నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధిస్తాననే ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. ఎంబీబీఎస్ పూర్తి చేసి గుండె వైద్య నిపుణుడు కావాలనే సంకల్పంతో అర్జున్ పట్టుదలతో చదువుతున్నాడు. కాగా తండ్రి నరేందర్ ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా, తల్లి వేల్పూర్ మండలం లక్కోర ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు.

590 ర్యాంకు సాధించిన వేదాంత్



వేదాంత్(590)

పెర్కిట్: ఆర్మూర్ మండలం కోమన్‌పల్లికి చెందిన బోగ శ్రీనివాస్, ఉమారాణి దంపతుల కుమారుడు బోగా వేదాంత్ ఈఏపీ సెట్ ఇంజినీరింగ్ విభాగంలో 590 ర్యాంకు సాధించాడు. వేదాంత్ ఇంటర్‌లో 988 మార్కులు సాధించాడు. జేఈఈ మెయిన్స్‌లో అఖిల భారత స్థాయిలో ఒపెన్ క్యాటగిరిలో 2,200 ర్యాంకు, క్యాటగిరిలో 404 ర్యాంకు సాధించాడు. జేఈఈ అడ్వాన్స్‌లో ఉత్తమ ర్యాంకుతో ఉన్నత కళాశాలలో సీటు సాధించి ఇంజినీర్ కావాలనే లక్ష్యంతో వేదాంత్ పట్టుదలతో ఉన్నాడు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా

నిజామాబాద్‌నాగారం: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్ష పార్టీ అని చెప్పుకుంటు రైతులను మోసం చేస్తుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటికే ఆర్ఆర్ అంటే రాహుల్, రేవంత్ టాక్స్ నడుస్తుంటే ఇప్పుడు కొత్తగా ఉత్తమ్ టాక్స్ కూడా పెట్టి వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ 43 రూపాయలకు బియ్యం అందించాలని చూస్తుంటే రాష్ట్రం 57 రూపాయలకు టెండర్లకు ఆహ్వానిస్తుందన్నారు. వేసవిలో పండించిన పంటకు రూ. 500 తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు పెట్టుబడికి భరోసాగా తీసుకొచ్చిన పసల్ బీమా యోజనను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నగరంలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, అధికారులు వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. ఎన్నికల కోడ్ తర్వాత శాఖల వారీగా సమీక్ష జరిపి అవినీతి ప్రక్షాళన తప్పకుండ జరుగుతుందన్నారు. బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ న్యాలం రాజు, బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు భారత్ భూషణ్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్స్ బైకన్ సుధా మధు, ఆకుల శ్రీనివాస్, ఇప్పకాయల కిషోర్, వెల్డింగ్ నారాయణ, ప్రభాకర్, నాయకులు మఠం పవన్, శిలా శ్రీనివాస్, పవన్ ముందడ, కార్తీక్, కస్తూరి కృష్ణ, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్పులు చేర్పులకు కొత్త దరఖాస్తులేనా..?

- గతంలో జారీ చేసిన రేషన్‌కార్డుల్లో స్పష్టత కరువు
- ప్రభుత్వం తాజా మార్గదర్శకాలు జారీ చేసేనా..?



మోర్తాడ్: రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసినా గతంలో జారీ చేసిన కార్డుల్లో మార్పులు చేర్పుల విషయంలో స్పష్టత లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. రేషన్ కార్డుల నుంచి మరణించిన వారి పేర్లు తొలగించిన గత ప్రభుత్వం పుట్టినవారు, పెళ్లి చేసుకుని అత్తారింట్లో అడుగు పెట్టిన వారి పేర్ల నమోదు విషయంలో నిర్లక్ష్యం వహించిందనే విమర్శలు ఉన్నాయి. ఆరేళ్ల క్రితం కొన్ని కార్డులను జారీ చేయగా ఆ తర్వాత జారీ చేయలేదు. ప్రభుత్వం ఏ పథకం అమలు చేసినా రేషన్‌కార్డులను ప్రామాణికం చేసింది. దీంతో అనేక మంది రేషన్ కార్డులు దక్కక పథకాలను సరిగా అందుకోలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాధారణ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పటికే జిల్లాలో 3,81,224 తెల్లరేషన్ కార్డులు ఉండగా, 20,940 అంత్యోదయ కార్డులు, 1,061 అన్నపూర్ణకార్డులు ఉన్నాయి. కొత్తగా పేర్లు నమోదు చేయడం, మార్పులు చేర్పులకు సంబంధించి జిల్లాలో గతంలో పౌర సరఫరాల శాఖకు అందిన దరఖాస్తుల సంఖ్య 77,758 ఉన్నాయి. వీటిలో కొన్ని పౌర సరఫరాల శాఖ కమిషనరేట్ కార్యాలయం, మరి కొన్ని జిల్లా పౌర సరఫరాల శాఖ, ఆర్డీవో, తహసీల్, ఆర్ఐల పరిశీలనలోనే ఆగిపోయాయి. మీ సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో అనేక మంది దరఖాస్తులను సమర్పించారు. రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం ఒకే చెప్పినా మార్పులు, చేర్పులకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలను జారీ చేయలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ దీనిపై తొందరగా స్పష్టత ఇస్తే గందరగోళానికి తెరదించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లాంగ్ టర్మ్‌లో ఇద్దరికి ర్యాంకులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులకు ఈఏపీ సెట్‌లో లాంగ్ టర్మ్‌లో ర్యాంకులు వచ్చాయి. గంగస్థాన్‌కు చెందిన అర్జున్ 579 ర్యాంకు సాధించాడు. అర్జున్ తల్లిదండ్రులు నరేందర్, రేణుక ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు. అర్జున్ హైదరాబాద్‌లోని చైతన్య కళాశాలలో ఇంటర్ చదివి అగ్రికల్చరల్ విభాగంలో ర్యాంకు సాధించాడు. నగరంలో వినాయక్‌నగర్‌కు చెందిన నిషిత రెడ్డి లాంగ్‌టర్మ్‌లో అగ్రికల్చర్ విభాగంలో 605 ర్యాంకు సాధించారు.

నందిపేట్ ఫార్మసిస్ట్ టర్మినెట్

నిజామాబాద్‌నాగారం: వైద్యశాఖలో విధులు నిర్వహించే కొంతమంది ఉద్యోగులు అధికారుల సంతకాలు ఫోర్జరీ చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదంతా గతంలో ఉన్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో పీహెచ్‌సీల్లో విధులు నిర్వహించే సిబ్బంది గురించి సరిగా పట్టించుకోక పోవడంతో వారి ఆగడాలకు అంతు లేకుండా పోయిందని సమాచారం. వీరు అధికారుల సంతకాలను ఫోర్జరీ చేస్తూ ఇదేంటని ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. తాజాగా నందిపేట్ మండలంలోని పీహెచ్‌సీలో ఫార్మసిస్టుగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మెడికల్ ఆఫీసర్ పవన్ సంతకాన్ని ఫోర్జరీ చేసి అడ్డంగా దొరికిపోయాడు. విధులకు సక్రమంగా హాజరు కాని రవి జీతం మాత్రం ఫుల్‌గా కావాలని, అందుకే మెడికల్ ఆఫీసర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి మరీ డీఎంహెచ్‌వో కార్యాలయానికి జీతాలకు సంబంధించి పత్రాలు సమర్పించాడు. దీనిపై అనుమానం వచ్చిన మెడికల్ ఆఫీసర్ పవన్ ఏప్రిల్‌లో డీఎంహెచ్‌వోకు రవికుమార్ తన సంతకాన్ని ఫోర్జరీ చేశాడని ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేసిన అధికారులు కలెక్టర్‌కు నివేదిక అందించారు. దీంతో శుక్రవారం సంతకాన్ని ఫోర్జరీ చేసిన రవికుమార్‌ను టర్మినెట్ చేశారు.

షేర్‌గల్లీలో దోపిడీ దొంగల హల్‌చల్

- ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధురాలిపై దాడి
- ప్రతిఘటించి కేకలు వేసిన వృద్ధురాలు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని షేర్‌గల్లీలో శుక్రవారం అర్ధరాత్రి దోపిడీ దొంగలు హల్‌చల్ చేశారు. ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధురాలిపై దాడి చేసి దోపిడీకి యత్నించగా వృద్ధురాలు ప్రతిఘటించి కేకలు వేయడంతో పరారయ్యారు. ఈ ఘటన కాలనీలో కలకలం సృష్టించింది. బాధితురాలు, స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కాలనీలోని ఓ ఇంట్లో మాసుల భాగమ్మ అనే వృద్ధురాలు నివసిస్తోంది. ఆమె సంబంధీకులు అందరూ పక్కనే వరుసగా ఉండే ఇళ్లల్లో ఉంటారు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి భోజనం చేసి ఇంట్లో నిద్రపోయింది. అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో ఓ మహిళా దొంగ ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న వృద్ధురాలిపై దాడి చేసి వృద్ధురాలి మెడలో ఉన్న మూడు తులాల బంగారం గొలుసు లాక్కునేందుకు యత్నించింది. ప్రతిఘటించిన వృద్ధురాలు దొంగను పక్కకు తోసేసింది. ఇంటి బయటకు పరుగులు తీసి కేకలు వేసింది. ఆమె అరుపులకు చుట్టుపక్కల వారు లేవడం గమనించిన మహిళా నిందితురాలు సిద్ధంగా ఉన్న మరో వ్యక్తితో కలిసి బైక్‌పై పరారైనట్లు తెలిసింది. వెంటనే స్థానికులు డయల్ 100కు ఫోన్ చేశారు. పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. దోపిడీకి యత్నించిన వారి ఆనవాళ్ల కోసం సమీపంలోని సీసీ పుటేజీలను పరిశీలించారు. శనివారం మధ్యాహ్నం సైతం కాలనీలో కొందరు మహిళలు గ్రైండర్ల విక్రయం, స్కీములు అంటూ అనుమానాస్పదంగా తిరుగుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. పోలీసులు నిఘా పెట్టాలని, దొంగల బెడదను అరికట్టాలని కోరుతున్నారు.

నూతన చట్టాల అమలుపై సమీక్ష



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని కోర్టులో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో నూతన చట్టాల అమలుపై డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి. లక్ష్మీనర్సయ్య శనివారం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భారతీయ న్యాయ సన్నిహిత-2023, భారతీయ నాగరిక సురక్ష సన్నిహిత-2023, పలు చట్టాలపై వివరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తమ విధులను శ్రద్ధతో నిర్వహించాలని, నూతన చట్టాలను అవలంబించి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్, రాజగోపాల్ గౌడ్, రాజారెడ్డి, బంటు వసంత్, కావేటి శేషు, నంద రమేశ్, ఖాందేశ్ శ్రీనివాస్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు భూసారపు రాజేశ్ గౌడ్, డాక్టర్ సమ్మయ్య, మహ్మద్ రహిముద్దీన్, అశోక్ శివరాంనాయక్, చిదిరాల రాణి, పారిక రాజేశ్వరి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



నీరడి లక్ష్మి మృతదేహం

మోపాల్: మండలంలోని మోపాల్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాంధారి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన నీరడి లక్ష్మి(45) శనివారం మృతి చెందింది. ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి తన కుమారుడు సాయికుమార్‌తో కలిసి బైక్‌పై నిజామాబాద్ వైపు వస్తున్నారు. అదే సమయంలో నగరంలోని గౌతంనగర్‌కు చెందిన సాత్విక్, శివ బైక్‌పై అదే వైపు వెళ్తున్నారు. ముందు వెళ్తున్న సాత్విక్ బైక్‌ను అకస్మాతుగా యూటర్న్ తీసుకునేందుకు ప్రయత్నించారు. వెనుక వస్తున్న సాయికుమార్ అదుపు తప్పి వారి వాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో లక్ష్మి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బట్టలు ఆరేస్తుండగా విద్యుదాఘాతంతో..



మంజుల మృతదేహం

పిట్లం: ఇంటి ఎదుట బట్టలు ఆరేస్తుండగా విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని గౌరారం తండాలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై నీరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మంజుల (38) ఉదయం ఇంటి ఎదుట ఉన్న రేకులకు కట్టిన జీ వైర్‌పై బట్టలు ఆరేస్తుండగా విద్యుదాఘాతం సంభవించి మృతి చెందింది. తల్లిని కాపాడే ప్రయత్నం చేసిన ఆమె పెద్ద కుమారుడు ప్రదీప్‌కుమార్‌కు సైతం గాయాలయ్యాయి. మృతురాలి భర్త లచ్చిరాం ఫిర్యాదు మేరకు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో వివాహిత ఆత్మహత్య

నవీపేట: భర్త వేధింపులు భరించలేక ఓ వివాహిత జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై యాదగిరి గౌడ్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన మల్కవ్వ(58)తో భర్త మారన్న తరచూ గొడవ పడేవాడు. దీంతో భర్త వేధింపులు భరించలేక మల్కవ్వ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు సాయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కిన యువకుడు



సదాశివనగర్: మద్యం మత్తులో ఓ యువకుడు వాటర్ ట్యాంక్ ఎక్కి హల్‌చల్ చేసిన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన వడ్డె రాజు మద్యం మత్తులో జీపీ సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ పైకి ఎక్కాడు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని రాజును సముదాయించి కిందికి దిగేలా చర్యలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులు కానిస్టేబుల్ వెంకటలక్ష్మిని, సిబ్బందిని అభినందించారు.

వడ్ల కుప్పలకు తప్పిన ముప్పు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామ కొనుగోలు కేంద్రం వద్ద వడ్ల కుప్పలకు శనివారం అగ్నిప్రమాద ముప్పు తప్పింది. పంట నూర్పిడి చేసిన ఎండు గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో మంటలు వరికొయ్యలను కాలుస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కుప్పల వైపు వచ్చాయి. సమాచారం అందుకున్న ఎల్లారెడ్డి అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. సిబ్బంది సేవలను గున్కుల్ సొసైటీ వైస్ చైర్మన్ గొట్టం నర్సింలు అభినందించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



బిచ్కుంద: మండలంలోని వాజిద్‌నగర్ శివారులో శనివారం విద్యుదాఘాతంతో ఓ గేదె మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. గుండెనెమ్లి గ్రామానికి చెందిన నారాయణ నాయక్ మంజీరాలో వాజిద్‌నగర్ గ్రామానికి తాగునీరు సరఫరా అయ్యే బావి దగ్గర గేదెను మేపుతున్నాడు. మోటర్ స్టార్టర్ వైరుతెగి కిందపడి ఉండడంతో మేత మేస్తున్న గేదెకు షాక్ తగిలి మృతి చెందింది. విద్యుత్, వెటర్నరీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందే విధంగా చూస్తామని అధికారులు రైతుకు హామీ ఇచ్చారు.

బైక్‌ను ఢీకొన్న ట్రైయినీ ఐపీఎస్ వాహనం

ఖలీల్‌వాడి: నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వినాయక్‌నగర్‌కు చెందిన అశోక్ పని నిమిత్తం బైక్‌పై బయటకు వచ్చాడు. ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ట్రైయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డి కారు ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అశోక్‌ను ట్రైయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డి తన కారులోనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడు అశోక్ చికిత్స పొందుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

ఎల్లారెడ్డిరూరల్: నాగిరెడ్డిపేట మండలంలోని లింగంపల్లి కలాన్ శివారులో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్, కాపర్ చోరీకి గురైంది. స్థానికులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 150 లీటర్ల ఆయిల్‌తో పాటు కాపర్ తీగలను దొంగలు చోరి చేసినట్లు వారు తెలిపారు.